# భావవీచికలు

మూలా వీరేశ్వరరావు

1) నా పిట్ట
పంజరం లో
లేదు
తన పాటల పంజరం లో
బంధించింది !

2)
పిట్ట
ఇంద్ర ధనస్సు
కప్పుకొంది
గళం లో
కేదార గౌళ
నింపు కొంది
వేకువ నుండి
కిటికీ దగ్గరే
నా మది కిటికీ
తెరుచుకొమని

3)
నాకు రెక్కలు లేవని తెలుసు
పిట్ట రెక్కల తో
లొకాల్ని చూసి
తన పాటల తో
నాకు చూపిస్తుంది !

4)
వలపు గూటి ని
వదిలి
నా కోసం
పిట్టల జంట
నా ఇంట
సౌందర్య పంట !

5)
కిటికీ బయట పాలపిట్ట!
లోపల కాగితాల కట్ట!!
కవిత్వం ప్రవహిస్తోంది
గుండె నుండి కాగితాల అంచుల వరకూ!!

★★★



## ఖరీదు
## బాలాజీ పంజా

నీ పెదాలపై  చిరునవ్వుని
ఒక పేజీ కవితతో కొనుక్కుంటాను

నీ ఓరకంట చూపుని
కొన్ని గంటల ఎదురుచూపుతో కొనుక్కుంటాను

నీ ధర్శనాన్ని
దేవుడికిచ్చే అర్చనతో కొనుక్కుంటాను

నిన్ను చూసి నేను పొందే హాయిని
మైళ్ల దూరం నడిచిన అలసటతో కొనుక్కుంటాను

నీ అందెల శభ్ధాన్ని
నాలోని ప్రశాంత నిశ్శబ్ధంతో కొనుక్కుంటాను

వెలకట్టలేని నీ ప్రేమని
నన్నే అర్పించి కొనుక్కుంటాను

***



## అమ్మా నాన్నా
## భమిడిపాటి స్వరాజ్య నాగరాజారావు

అప్పుడు.......
వెళ్ళిపోయిన నాన్న జ్ఞాపకాలతో
అమ్మ మిగిలిపోయినప్పుడు,
మరుగైపోయిన ఆతని  వ్యాపకాలలో
అమ్మ మనసు రగిలిపోయినప్పుడు,
మబ్బులు కప్పిన సూర్యుడు,
గ్రహణం పట్టిన చంద్రుడు,
నాకు అమ్మ కనులలో కనపడ్డారు!
అమ్మ నుదిటిపై మెరిసిన సింధూరపు ఎర్రదనం
ఆమె కనులలోకి జారింది,
అమ్మ కంటిలోని కాటుకలోని నల్లదనం
ఆమె జీవితంలోకి చేరింది,
అమ్మ పెదవులపై కదలాడే నవ్వు
గువ్వలా ఎక్కడికో ఎగిరిపోయింది,
అమ్మ వదనంలో తొణికిసలాడిన కళ
కలవరంలో కలిగిపోయింది,
అమ్మకనులలో నాకు పొంగి ప్రవహిస్తున్న
సెలయేళ్ల నీడలు  కదిలాయి!
అమ్మ మదిలో నాకు ప్రేలి ప్రజ్వలిస్తున్న
అగ్నిపర్వతాల జాడలు మెదిలాయి!!
వెళ్ళిపోయిన నాన్న, మిగిలిపోయిన అమ్మ
నా ఉనికి వారిది, వారి వేదన నాది..!!

★★★

# కృష్ణం

స్వాతి సాయి యాకసిరి

అంతరంగం చుట్టూరా కప్పుకున్న కిటికీ ఊచలపై
ఓ ఆగంతకత్వం చేసే చప్పుడు చెప్పింది
కలలకి కూడా కంచెలు కట్టే వాస్తవాన్ని పక్కన పెట్టి
విశ్రాంతి కోసం ఎక్కడికో పయనం కట్టాలనుకోడం ఎంత దురాశో

ఖచ్చితత్వపు వాతావరణాలన్నీ
మిథ్యలో చోటు కొనుక్కున్నప్పుడు
కృష్ణశబ్దపు సాంత్వనమే శరణమవుతుంది
శ్వేతసంతకాలన్నీ తారలుగా మారిపోయి
విశ్వంలోకి విసిరేయబడ్డాక
ప్రియమారా హత్తుకుంటానంటూ వస్తున్న కృష్ణవర్ణాన్ని
కంటి ప్రమిదల్లో ఇంధనం చేసుకున్నప్పుడు తెలిసి వస్తుంది
ఆకాశమంత వెన్నెలా
కన్నీటి బొట్టుకంటే తక్కువ బరువే తూగుతుందని

కల్మషమంటని శైశవపు చీకటికి
ఇప్పటికిప్పుడే ముగింపు రాసేద్దామనే తొందరలో
లేత కాంతిని కర్కశంగా తొక్కుకుంటూ
నడచిన నడకల కింద
ఒక చెమ్మగా కూలిపోయిన ఆచూకీ
ఇక దొరికేదెవరికి?

****





# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఈ దినమ్మున యుదయించితిలను నేను
ఇది మహానందసీమయంచెదను తోచె
కనుల మరుగయ్యె గతమైన కాలమెల్ల
వర్తమానము కనులకు స్పష్టమయ్యె

జన్మదినమున జ్యోతి ప్రజ్వలితమయ్యె
చుట్టుప్రక్కల నున్నది చూపుకందె
కరుగు క్రొవ్వొత్తి తలనుండి కాళ్ళ వరకు
అడుగులను వేయు జీవనయానమిద్ది

ఎవ్వరెవ్వరో వచ్చి నా హృదయమునకు
చేరువయ్యును క్రమ్మర దూరమైరి
దూరమయ్యును మరల నా చేరువైరి
క్షణికములో యిట్టి కలయికల్ శాశ్వతములో!

క్షణము విడువక బ్రతుకెల్ల కలసియుండి
ఆత్మనెరుగలేని పరిచయమ్ములెన్నొ
అంతరంగమ్మునెరిగెడు యాప్తులెవరు?
ఎదనెరిగి యిచ్చటే నివసించునెవరు?

వెలుగు పయనించుచున్నది పృథివి వైపు
స్పష్టముగనింకను ధర కన్పట్టుచుండె
ఇరులు నిండి సర్వము కనుమరగులోపు
చెంత చేరెదవంచు వాంఛించుచుందు



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS